


## అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి

-ఎస్ఐఆర్ రెండో దశపై బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణలో

-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

2

# సంగారెడ్డి మెదక్

మంగళవారం 01 సెప్టెంబర్ 2026 www. praja jyothi news.com పేజీలు:14

# రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

## - నిర్లక్ష్యాన్ని వీడకపోతే దీక్షలు, రాస్తారోకోలు చేస్తాం బీఆర్ఎస్ నేతల హెచ్చరిక




**మెదక్ (ప్రజాజ్యోతి )**

మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండల కేంద్రం నుండి కలాని షట్ పల్లి మీదుగా మెదక్ డబుల్ బెడ్ రూమ్ ల వరకు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని పాదయాత్ర నిర్వహించడం జరిగింది. నర్సాపూర్ శాసనసభ్యులు శ్రీమతి వాకిట సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పోతుల బొగుడ రోడ్డు నుంచి వెల్దుర్తిషేట్పల్లి కలాన్ వరకు చేపట్టిన పాదయాత్రలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ శ్రీమతి పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆమెతో పాటు మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు. మిగతా 2 లో

## సదాశివపేటలో రూ.50 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా విచారణకు

# కలెక్టర్ ఆదేశించినా అందని చర్యలు!





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సదాశివపేట పట్టణంలో రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతుందనే వార్త కలకలం రేపుతోంది. సర్వే నంబర్ 414లోని కమ్మరికుంటకు చెందిన సుమారు 4 ఎకరాల 26 గుంటల ప్రభుత్వ భూమిని కొందరు ప్రైవేట్ వ్యక్తులు అధికారుల అండదండలతో ఆక్రమించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మిగతా 2 లో





# ఖాజిపల్లి లో ఘనంగా బోనాల పండుగ

## - పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**జిన్నారం(ప్రజాజ్యోతి)**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి

మొదటిపేజీ తరువాయి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:**

అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా చేపట్టనున్న ఎస్ఐఆర్ రెండో దశపై నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గాంధీభవన్ నుంచి వచ్చిన ప్రధాన శిక్షకుడు, ఎస్ఐఆర్ సమన్వయకర్త మాణిక్యం మల్లేష్ యాదవ్ బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ ఇచ్చారు. తమ పరిధిలోని ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించడం, అర్హులైన ప్రతి ఓటరును గుర్తించడం, అర్హులైన వారి పేర్లు జాబితాలో ఉండేలా చూడటం, అవసరమైన సవరణలు చేయించడం, ఓటర్ల వివరాలను పరిశీలించడం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని బూత్ స్థాయి ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బూత్ పరిధిలోని ఓటరు జాబితాను బాధ్యతగా పరిశీలిస్తూ, అర్హులైన ఓటర్ల హక్కులు కాపాడే విధంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయి ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ రెండో దశ ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడి, తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించి ప్రజలకు, రైతన్నలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించకపోతే ప్రజల తరపున దీక్షలు, రాస్తారోకోలు చేపడతామని నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.







## సదాశివపేటలో రూ.50 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా విచారణకు కలెక్టర్ ఆదేశించినా అందని చర్యలు!

మొదటిపేజీ తరువాయి

ఈ స్థలంలో అక్రమంగా కమర్షియల్ షెడ్లు, వైన్ షాపులు, తాత్కాలిక గుడారాలు నిర్మించి భారీగా అద్దెలు వసూలు చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ భూకబ్జాపై చర్యలు తీసుకోవాలని సదాశివపేట మునిసిపాలిటీ మాజీ కౌన్సిలర్ చౌదరి ప్రకాష్ గతంలో కలెక్టరేట్‌లోని 'ప్రజావాణి'లో జిల్లా కలెక్టర్ ని స్వయంగా కలసి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కలెక్టరేట్ ఆఫీస్, వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సదాశివపేట తహశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు జులై 27న మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ, నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితులు, మీడియా ప్రతినిధులు వివరణ కోరగా... కలెక్టర్ ఆఫీస్ నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదంటూ రెవెన్యూ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, రూ.50 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమణదారుల నుంచి కాపాడి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సదాశివపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# 15వ ఆర్థిక సంఘం నిధులతో మెదక్ మున్సిపాలిటీకి
# రూ.2.31 కోట్ల నిధులు మంజూరు

మెదక్ (ప్రజాజ్యోతి)

ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు కృషికి ప్రజల ప్రశంసలు15వ ఆర్థిక సంఘం కింద మెదక్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 2,31,10,682 (రెండు కోట్ల ముప్పై ఒక లక్ష పది వేల ఆరు వందల ఎనభై రెండు రూపాయలు) నిధులు మంజూరయ్యాయి.మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులను సాధించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు నిరంతరం కృషి చేస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మెదక్‌ను అభివృద్ధి చెందిన, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఆయన ముందుకు సాగుతున్నారు.ఒకవైపు విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూనే, మరోవైపు మెదక్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం ఎమ్మెల్యే పలు చర్యలు చేపడుతున్నారు.15వ ఆర్థిక సంఘం కింద మున్సిపాలిటీకి నిధులు మంజూరు కావడం ద్వారా మెదక్ పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులకు అవకాశం ఏర్పడింది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా ఈ నిధులు ఉపయోగపడనున్నాయి.మెదక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు చేస్తున్న నిరంతర ప్రయత్నాలను నియోజకవర్గ ప్రజలు ప్రశంసిస్తున్నారు.





# గ్రామ ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ ఆర్థిక అండ

## - హుగ్గెల్లీలో పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి తరపున వివాహ కానుక

జహీరాబాద్, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి న్యూస్)

గ్రామ ఆడబిడ్డల శుభకార్యాలకు అండగా నిలుస్తూ హుగ్గెల్లీ గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. హుగ్గెల్లీ గ్రామానికి చెందిన పోలీస్ ఇసాముద్దిన్ కుమార్తె వివాహం సందర్భంగా సర్పంచ్ తరపున 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ ఆర్థిక సాయాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజు, గ్రామ సీనియర్ నాయకులు నర్సింహులు, నరేష్, మోముల పాండు రంగారెడ్డి, అశోక్, సిద్ధారెడ్డి, కె.శ్రీనివాస్, అశోక్, ముస్తఫా, రాములు, కిష్టారెడ్డి, అక్బర్ తదితరులు కుటుంబ సభ్యులకు అంద జేశారు. తమ కుమార్తె వివాహానికి ఆర్థికంగా అండగా నిలిచిన సర్పంచ్ పట్లోళ్ల విమల శ్రీనివాస్‌రెడ్డికి కుటుంబ సభ్యులు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతో పాటు గ్రామ ప్రజల శుభకార్యాల్లో సర్పంచ్ అండగా నిలవడం అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మట్టి ముద్దకు మహద్రూపం..

## - మెదక్‌లో గణేశ్ విగ్రహాలకు పెరుగుతున్న డిమాండ్





మెదక్ (ప్రజాజ్యోతి )

వినాయక చవితి ఉత్సవాలు సమీపిస్తున్న వేళ మెదక్‌లో గణేశ్ విగ్రహాల తయారీ జోరందుకుంది. మట్టి ముద్దకు కళాకారులు తమ నైపుణ్యాన్ని జోడించి అందమైన గణనాథుల విగ్రహాలకు రూపమిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శిల్పకారులు అద్భుతమైన ఆకృతులతో విగ్రహాలను తయారు చేస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు.విభిన్న రూపాలు, ఆకృతులు, రంగులతో గణేశ్ విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాల వరకు ప్రత్యేక శ్రద్ధతో తయారు చేస్తున్నారు. ఉత్సవ నిర్వాహకులు తమకు నచ్చిన ఆకృతులను ముందుగానే ఎంపిక చేసుకుని విగ్రహాలను ఆర్డర్ చేస్తున్నారు. దీంతో విగ్రహాల తయారీ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.మరోవైపు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతుల వైపు ప్రజలు ఆసక్తి చూపడం కూడా పెరుగుతోంది. మట్టి విగ్రహాలు నీటిలో సులభంగా కలిసిపోవడంతో పర్యావరణానికి మేలు జరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు.వినాయక చవితి సందర్భంగా మెదక్‌లోని వీధులు, ప్రధాన కూడళ్లు గణనాథుల ప్రతిమలతో కళకళలాడనున్నాయి. ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లకు సిద్ధమవుతుండగా.. శిల్పకారులు మాత్రం విగ్రహాలకు తుది మెరుగులు దిద్దే పనిలో నిమగ్నమయ్యారు.





# రోడ్డు కోసం రోడ్డెక్కిన ప్రజలు..

# గర్జించిన బీఆర్ఎస్

- రోడ్డు వేయాల్సిందే.. ప్రజల కష్టాలు తీర్చాల్సిందే
- గుంతల రోడ్డుపై గర్జన.. ప్రభుత్వానికి బీఆర్ఎస్ హెచ్చరిక
- రోడ్డు పూర్తయ్యే వరకు పోరాటం ఆగదు: ఎమ్మెల్యే సునీతారెడ్డి
- ప్రజల కష్టాలు పట్టించుకోవాలి: మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి), ఆగస్టు 31:**

వెల్దుర్తి నుంచి మెదక్ వరకు దారితీసే ప్రధాన రహదారి దుస్థితిపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, పూర్తిస్థాయిలో రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మహా పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది.వెల్దుర్తి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పాదయాత్ర ప్రారంభమైంది. వెల్దుర్తి నుంచి పోతులబోగోడ మీదుగా చెట్లపల్లి కలాన్ వరకు సాగిన ఈ










పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రోడ్డు వేయాలి.. ప్రజల కష్టాలు తీర్చాలి.. పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి అంటూ నినాదాలతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి.

### ప్రజలకు నరకయాతన.. పట్టించుకునే నాథుడెవరు?

గుంతలు, కంకర, బురదతో అధ్వానంగా మారిన రహదారిపై ప్రయాణం ప్రజలకు నిత్య నరకయాతనగా మారిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు సైతం సకాలంలో చేరుకోలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, రహదారి దుస్థితి కారణంగా ప్రజల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

### నిధులు మంజూరు చేసినా పనులు ఎందుకు ఆగాయి?

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెల్దుర్తిమెదక్ రహదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం ఇకనైనా గుర్తించి రహదారి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు."ప్రజల సమస్యను ప్రభుత్వం తేలికగా తీసుకోవద్దు. రహదారి పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన మా పోరాటం కొనసాగుతుంది. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం" అని ఎమ్మెల్యే సునీతారెడ్డి హెచ్చరించారు.

### ప్రజల కష్టాలు పట్టించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రహదారి దుస్థితితో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అభివృద్ధి పనులు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలని అన్నారు. ప్రజల రవాణా సమస్యను పరిష్కరించే వరకు పోరాటానికి అండగా ఉంటామని స్పష్టం చేశారు.వెల్దుర్తి నుంచి మెదక్ వరకు రహదారి నిర్మాణం పూర్తిచేయాలనే డిమాండ్‌తో సాగిన ఈ మహా పాదయాత్ర బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు, రహదారి సమస్యను మరోసారి రాజకీయంగా తెరపైకి తీసుకొచ్చింది.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కృష్ణగౌడ్, మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శాకాహారం శ్రీనివాస్ గౌడ్, జెగ్గా అశోక్ గౌడ్, కమ్మరి శ్రావణ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి కంఠరెడ్డి. తిరుపతి రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం

నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన గుమ్ముల పోచయ్య సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నాయకుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి మృతుని కుటుంబానికి అండగా నిలిచారు. తన తరఫున రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తల ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎల్లం యాదవ్, రాములు, సిద్ధ రాములు, గుమ్ముల మైసయ్య, దొంతరమైన శీను, ఎండీ హబీబ్, చాకలి ఎల్లం, ఎస్.బొమ్మలింగం, కుమ్మరి పోచయ్య, కుమ్మరి మహేష్, కుమ్మరి రాములు, కరెయ్య, మెట్టు నాంపల్లి, పిట్ల శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## సదాశివపేటలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందడి..

### - శాస్త్రోక్తంగా కర్ర పూజ నిర్వహించిన 'శ్రీ నవ సమాజ్ సేవా సదన్'

**సంగారెడ్డి ప్రజా జ్యోతి :**



సదాశివపేటలో వినాయక చవితి వేడుకల సందడి అప్పుడే మొదలైంది. గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు పట్టణంలోని శ్రీ నవ సమాజ్ సేవా సదన్ నిర్వాహకులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక చవితి పండగను పురస్కరించుకుని శ్రీ నవ సమాజ్ సేవా సదన్ ఆధ్వర్యంలో కర్ర పూజ కార్యక్రమాన్ని వేద మంత్రోచ్ఛారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండప నిర్మాణానికి ఉపయోగించే ప్రతిని నమస్కరించి, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో నిర్వాహకులు, సభ్యులు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కర్ర పూజ పూర్తి కావడంతో గణపతి భారీ మండప నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా భక్తులను ఆకట్టుకునే రీతిలో వినూత్నంగా, వైభవంగా మండపాన్ని తీర్చిదిద్దనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, ఆధ్యాత్మిక వాతావరణంలో పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని సేవా సదన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

### - సెప్టెంబర్ 2 నుంచి 10 వరకు నిరసన కార్యక్రమాలు జహీరాబాద్ పట్టణంలో సమీక్ష సమావేశం

### - బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే మాణిక్ రావు దిశానిర్దేశం

**జహీరాబాద్, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 10వ తేదీ వరకు చేపట్ట నున్న నిరసన కార్యక్రమాలపై జహీరాబాద్ పట్టణంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కౌన్సిలర్ అభ్యర్థులు, ముఖ్య నాయకులతో సమావేశమై చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ఆరు గ్యారంటీల వైఫల్యా లు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వ వైఫల్యా లను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా నిరసన కార్యక్రమాలను విజయవంతంగానిర్వహించా లని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 2నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాల్లో



బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయ వంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తంజీం, సీనియర్ నాయకులు నామా రవికిరణ్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, కౌన్సిలర్లు అబ్దుల్లా, దీపక్, గౌస్ గోరి, జాకీర్, జాహెద్, మహిపాల్, విశ్వేశ్వర్, ప్రవీణ్, శంకర్ రెడ్డి, బరూర్ దత్తాత్రి, వెంకట్, నసీర్, కళ్లెం రవీందర్, అక్బర్, మొహమ్మద్ అలీ, శివకుమార్ స్వామి, ఇంద్రారెడ్డి, వేణు, బీఆర్ఎస్వీ అధ్యక్షులు రాకేష్, ఫయాజ్ ,ప్రవీణ్ చింటూ తదితరులు పాల్గొన్నారు.

## డాకూర్‌లో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

### - భారీగా తరలివచ్చిన భక్తులు.. బీఆర్ఎస్ నాయకుల సందడి

**అందోల్, ఆగస్టు 31, (ప్రజాజ్యోతి):**

గ్రామీణ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాల మధ్య డాకూర్ గ్రామంలో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి. జైపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీలు పి. నారాయణ ముదిరాజ్, అర్జునయ్య, రామ గౌడ్, జె. బాలయ్య, డాకూర్ సర్పంచ్ వసంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఐకమత్యంతో ఉండాలని వారు ఆకాంక్షించారు. వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు లింగా గౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, జగన్ మోహన్ రెడ్డి, ఎ. శంకరయ్య, బీర్ల శంకర్, నాగరత్నం గౌడ్, ఉసా నాగరాజు, సాయి కుమార్, జేన్న విజయ్ కుమార్, ఖాజా పాషా, ఎం.డి. గోరే, ఖలీల్, ఇమ్రాన్ ఖాన్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు. డాకూర్ గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# కలెక్టరేట్ ప్రజావాణికి 41 ఫిర్యాదులు

## - ప్రజావాణి ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

## - అదనపు కలెక్టర్లు సంగీత, పాండు





**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 31:-**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడంతో పాటు సంబంధిత దరఖాస్తుదారులకు స్పష్టమైన సమాధానం అందించాలని అదనపు కలెక్టర్లు సంగీత, పాండు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తులపై తీసుకున్న చర్యలను నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్లు సూచించారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజలు సంబంధిత మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదులు, వినతులు సమర్పించవచ్చని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్లు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు, వినతులు అందాయనీ, వీటిలో కలెక్టరేట్‌లో 41, సంగారెడ్డి డివిజన్‌లో 22, జహీరాబాద్ డివిజన 05, నారాయణఖేడ్ డివిజన్ 03 ఫిర్యాదులు, వినతులు అందగా, అందోల్ డివిజన్‌లో ఎలాంటి ఫిర్యాదులు, వినతులు అందలేదని తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి, పోలీస్, ఆర్టీసీ, నిమ్జ్, ఎంప్లాయ్‌మెంట్, ఎస్సీ, బీసీ అభివృద్ధి, సహకార, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వ్యవసాయం, డీఆర్డీఏ, గ్రౌండ్ వాటర్, నీటిపారుదల, ఆర్‌సీఓ, కార్మిక, జిల్లా పరిషత్, మున్సిపల్, విద్య తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు, వినతులు అందాయి.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిలోనుండి రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:**

నారాయణఖేడ్ మండలంలోని పీర్లతాండా వద్ద ప్రభుత్వ అసైన్డ్ భూమిలో నుండి అక్రమంగా రోడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ నారాయణఖేడ్ నియోజకవర్గ అధ్యక్షులు అనుముల తుకారాం అన్నారు. సోమవారం ఆయన నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. పీర్లతాండా వద్ద కొందరు వ్యక్తులు ప్రభుత్వ అసైన్డ్ భూమిలోనుండి అక్రమంగా ఫార్మ్ ల్యాండ్ కోసం 120/50 సర్వే నంబర్ నుండి 40 ఫీట్ల వెడల్పుతో విశాలమైన రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. రియల్ ఎస్టేట్ యజమాని భూమికోసం మాత్రమే అసైన్డ్ భూమిలోనుండి అక్రమంగా రోడ్డు వేస్తున్నారని, రోడ్డు ఏర్పాటు వల్ల తాండా వాసులకు ఎలాంటి లాభం లేదు కాబట్టి అక్రమంగా ప్రభుత్వ భూమిలోనుండి రోడ్డు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



## రూ.11 వేల కోట్ల బకాయిలపై ఏబీవీపీ ఆందోళన

### - స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్

**అందోల్, ఆగస్టు 31, (ప్రజాజ్యోతి):**





ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు పేరుకుపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఏబీవీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జోగిపేట ఎంఆర్ఓ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా హాస్టల్ కన్వీనర్ సాయికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో సుమారు రూ.11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఫీజు బకాయిల కారణంగా ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని, పలువురు విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి రావడం ఆందోళనకరమన్నారు.

### హామీల అమలులో జాప్యం ఎందుకు?

ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ప్రత్యేక గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ప్రతి నెలా నిధులు విడుదల చేస్తామని గతంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యాశాఖ బాధ్యతలు కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్న నేపథ్యంలో విద్యార్థుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు తప్ప ప్రభుత్వం అందించే భిక్ష కాదని స్పష్టం చేశారు. నిధుల విడుదలలో మరింత జాప్యం చేస్తే కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల ఆందోళనలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ఏబీవీపీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు మహేష్, వర్షిత్, అశ్వంత్, లోకేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# తల్లి త్యాగం..

## కొడుకు ప్రాణం నిలవలేదు!

- కిడ్నీ సమస్యతో చికిత్స పొందుతూ యువకుడు మృతి..

- కన్నీటిపర్యంతమైన కుటుంబ సభ్యులు.

**కల్హేర్, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**



కల్హేర్ మండలంలోని రాపర్తి గ్రామానికి చెందిన ఈర్ల సాయిలు కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు.కొంతకాలం క్రితం సాయిలుకు తీవ్ర కిడ్నీ సమస్య తలెత్తడంతో ఆయన తల్లి కిడ్నీ దానం చేశారు. అనంతరం కొంతకాలం ఆయన ఆరోగ్యంగా ఉన్నారు. అయితే ఇటీవల పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు.సాయిలు మృతితో రాపర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు ఆయన మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు..

# పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగా బోధించాలి

- కల్హేర్ మండల విద్యాధికారి బి. సురేష్

**కల్హేర్, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**



ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా బాధ్యతగా, అంకితభావంతో విధులు నిర్వహించాలని కల్హేర్ మండల విద్యాధికారి బి. సురేష్ సూచించారు.సోమవారం కల్హేర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన స్థాయిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాలను ప్రణాళికాబద్ధంగా, అర్థవంతంగా బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. ఉపాధ్యాయులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఎంఈఓ బి. సురేష్ కోరారు.

# లోటస్ ఫార్మ్ ల్యాండ్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

- రిజిస్ట్రేషన్లు తాత్కాలికంగా నిలిపివేయాలని తహశీల్దార్‌కు బీఎస్పీ నేత వినతి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:**







నారాయణఖేడ్ మండలం అబ్బెంద గ్రామంలో లోటస్ ఫార్మ్ ల్యాండ్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, అనుమతులపై స్పష్టత వచ్చే వరకు రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని బీఎస్పీ నారాయణఖేడ్ అధ్యక్షుడు అనుముల తుకారాం కోరారు. సోమవారం నారాయణఖేడ్ తహశీల్దార్ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 50 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీగా ప్రాజెక్టును ప్రచారం చేస్తూ, రూ.18 లక్షలకు 1,210 గజాల ప్లాట్‌తో పాటు 1బీహెచ్‌కే ఫార్మ్‌హౌస్, మహోగని తదితర మొక్కలు, రిసార్ట్, వీకెండ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు ప్రచారానికి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టులోని కొంత భూమి గుట్టలపై ఉన్నట్లు, సరైన రహదారి సౌకర్యం లేదని, ప్రాజెక్టుకు చేరుకోవాలంటే వాగు దాటాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. వర్షాకాలంలో వాగు ప్రవాహం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు, ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.అనుమతులపై స్పష్టత ఇవ్వాలి సదరు భూమి వాస్తవ భూ స్వరూపం, భూమి వినియోగం, రెవెన్యూ రికార్డులను పరిశీలించాలని కోరారు. ఫార్మ్ ల్యాండ్ పేరుతో భూమిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. రిసార్ట్, వీకెండ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ తదితర నిర్మాణాలకు సంబంధిత శాఖల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొందారా అనే అంశాన్ని కూడా పరిశీలించాలని కోరారు. అలాగే గుట్టలను తవ్వి రహదారులు ఏర్పాటు చేసినట్లయితే అందుకు అనుమతులు ఉన్నాయా, ప్రాజెక్టుకు సరైన రహదారి, రాకపోకలు, ఇతర మౌలిక వసతులు ఉన్నాయా అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని కోరారు. ప్రజలకు ఇచ్చే ప్రకటనలు, బ్రోచర్లలో పేర్కొంటున్న హామీలు వాస్తవాలకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని కూడా అధికారులు నిర్ధారించాలని తెలిపారు.విచారణ పూర్తయ్యే వరకు ప్రజలకు నష్టం కలగకుండా లోటస్ ఫార్మ్ ల్యాండ్ పేరుతో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేయడానికి సంబంధిత ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని తహశీల్దార్‌ను కోరారు. నిబంధనలకు విరుద్ధంగా భూమి విక్రయాలు లేదా నిర్మాణాలు జరుగుతున్నట్లు విచారణలో తేలితే సంబంధిత నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# సంగారెడ్డి జిల్లా మునిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో తీవ్ర ఉద్రిక్తత ప్రిన్సిపాల్ శైలజ

## వేధింపులపై విద్యార్థినుల ఆందోళన

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

మునిపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రిన్సిపాల్ శైలజ వేధింపులు భరించలేకపోతున్నామంటూ విద్యార్థినులు కళాశాల ఆడిటోరియంలో భారీ







ఆందోళనకు దిగారు.గత నెల రోజులుగా హాస్టల్ భోజనంలో పురుగులు వస్తున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రిన్సిపాల్ శైలజ ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు. అంతేకాకుండా, ప్రతిరోజూ రాత్రి తన గదికి వచ్చి పడుకోవాలంటూ విద్యార్థినులను బలవంతం చేస్తున్నారని, అందుకు ఒప్పుకోని వారిపై కక్షగట్టి కఠినమైన శిక్షలు విధిస్తున్నారని విద్యార్థినులు కన్నీటిపర్యంతమయ్యారు.ప్రిన్సిపాల్ శైలజ గతంలో పనిచేసిన ప్రాంతాల్లోనూ విద్యార్థులు ఆమెకు వ్యతిరేకంగా ధర్నాలు చేశారని, అక్కడ నుంచి ఇక్కడికి వచ్చినా ఆమె తీరు ఏమాత్రం మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని, ఉన్న వసతులను సైతం విద్యార్థులకు అందకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు.తక్షణమే ప్రిన్సిపాల్ శైలజను ఇక్కడి నుంచి బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు ఆడిటోరియంలో బైఠాయించారు. సమాచారం అందుకున్న అధికారులు కళాశాలకు చేరుకుని, సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థినులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. అయితే ధర్నా ముగిసిన వెంటనే వడ్డించిన భోజనంలో మళ్లీ పురుగులు రావడంతో దిగ్భ్రాంతికి గురైన విద్యార్థినులు, ఆ అన్నాన్ని తినకుండా అక్కడే పారవేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.



# అభివృద్ధిలో అగ్రగామిగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ

## - రూ.3.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

## - పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో మౌలిక వసతులను మెరుగుపరుస్తూ, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని ఇస్నాపూర్, చిట్కుల్, లకడారం వార్డుల్లో రూ.3 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా మున్సిపాలిటీలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### నాణ్యతతో.. వేగంగా పనులు

శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని అధికారులకు స్పష్టం చేశారు.ఇస్నాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, పాండు, నరేందర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, రాహుల్ రెడ్డి, సంధ్య నవీన్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వెంకటేష్, ఈశ్వరమ్మ, జనార్ధన్ రెడ్డి, ఆంజనేయులు, మమత అరుణ్, రాజు, లత వెంకటేష్, కో–ఆప్షన్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి, సోనియా రాజు, నిజాముద్దీన్ బాబా, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేరాజ్ ఖాన్, కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల అభివృద్ధికి విద్య ప్రధాన మార్గం....

## అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు







**సంగారెడ్డి ప్రజా జ్యోతి ఆగస్టు 31**

:సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలను తొలగించి అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి సాధించేందుకు విద్య ఒక్కటే ప్రధాన మార్గమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పాండు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి అదనపు కలెక్టర్ పాండు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,మనుషులను కులాలు, జాతుల పేరుతో విభజించి చూడకుండా ప్రతి ఒక్కరూ సమానంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కులం, జాతి, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మనిషి తన ఆశయానికి అనుగుణంగా ఉన్నత హోదాలను సాధించడానికి విద్య ఎంతో దోహదపడుతుందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సంచార జాతులు, వెనుకబడిన తరగతులకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆర్థిక పరిస్థితులు, సామాజిక వెనుకబాటుతనాన్ని అధిగమించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి విద్యే శాశ్వతమైన మార్గమని అన్నారు. “చదువు ఒక్కటే అభివృద్ధికి పరిష్కారం” అనే విషయాన్ని ప్రతి కుటుంబం గుర్తించాలని పిలుపునిచ్చారు.సంచార జాతులు, విముక్త జాతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఎంబీసీ జిల్లా అధ్యక్షులు హనుమంతు, ఎంబీసీ సంచార జాతుల కార్యదర్శి వినోద్, వీరభద్రుల కులాల అధ్యక్షులు అలుగు మల్లేశం, జంగమ ఎంబీసీ రాష్ట్ర కార్యదర్శి వీరేశం, వీరభద్రుల కులాల జిల్లా అధ్యక్షులు మోహన్ బాబు, ఎంబీసీ జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్‌తో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ధరలు మండుతున్నా.. ప్రభుత్వానికి చలనం లేదా?

- ప్రజా సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా
- పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్



**కొండాపూర్ ప్రజా జ్యోతి**

రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం కొండాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం కొండాపూర్ మండల కార్యదర్శి రాజయ్య మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు మండలంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గుర్తించి నిరుపేదలకు వెంటనే కేటాయించాలని కోరారు.రేషన్ షాపుల ద్వారా పేదలకు 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని, విద్య, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు వెంటనే మంజూరు చేయాలని అన్నారు.

### రైతుల సమస్యలపై ప్రభుత్వానికి డిమాండ్లు

భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించాలని రాజయ్య డిమాండ్ చేశారు. అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించాలని కోరారు.కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు రుణ సదుపాయం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

### సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని సీపీఎం నాయకులు విమర్శించారు. పేదలు, రైతులు, కౌలు రైతులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం కొండాపూర్ మండల కమిటీ సభ్యులు బాబురావు, నాయకులు నరసింహులు, సుధాకర్, సురేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేటలో రూ. 50 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

## కలెక్టరేట్‌లో బిజెపి నాయకుల ఫిర్యాదు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో దాదాపు 50 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణదారుల పలైపోతోంది. పట్టణంలోని పోలీస్ స్టేషన్ వెనకాల ఉన్న కమ్మరి కుంట శిఖం భూమి 4 ఎకరాల 24 గుంటల స్థలాన్ని కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకుని రేకుల షెడ్లు వేసి అద్దెలు దండుకుంటున్నారు. ఈ అక్రమ కట్టడాలను వెంటనే తొలగించి, ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజలకు ఉపయోగపడేలా పార్కు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈ రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బిజెపి నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.సదాశివపేట పట్టణంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. పోలీస్ స్టేషన్ వెనకాల ఉన్న కమ్మరి కుంట శిఖం పరిధిలోని 4 ఎకరాల 24 గుంటల ప్రభుత్వ భూమిపై ఆక్రమణదారుల కన్ను పడింది. దీని విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు 50 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా.అంత విలువైన స్థలాన్ని అధికారులు పట్టించుకోకపోవడంతో, ఆక్రమణదారులు రేకుల షెడ్లు నిర్మించి నెలకు వేలాది రూపాయలు కిరాయిలు వసూలు చేస్తున్నారు. గతంలో ఈ ఆక్రమణలపై స్థానిక పత్రికల్లో కథనాలు వచ్చినా, కొందరు బాధ్యతాయుత పౌరులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారుల తీరులో ఎలాంటి మార్పు రాలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిమ్మకు నీరెత్తిన వైఖరి వల్ల సదాశివపేట పట్టణ ప్రజలు ఎంతో నష్టపోతున్నారు.ఈ నేపథ్యంలో ఈ రోజు, అనగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో బిజెపి నాయకులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు."సదాశివపేట పోలీస్ స్టేషన్ వెనకాల ఉన్న కమ్మరి కుంట శిఖం భూమి దాదాపు 50 కోట్ల విలువైనది. అధికారుల అలసత్వం వల్ల ఈ భూమిని ఎవరికి తోచినంత వారు కబ్జా చేసి రేకుల షెడ్లు వేసుకుని అద్దెలు దండుకుంటున్నారు. పలుమార్లు కలెక్టర్ కి విన్నవించినా, పేపర్లలో వార్తలు వచ్చినా అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం దారుణం. వెంటనే ఈ



అక్రమ కట్టడాలను కూల్చివేసి, ఆ 4 ఎకరాల 24 గుంటల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. అక్కడ స్థానిక ప్రజలకు ఉపయోగపడేలా ఒక అందమైన పార్కును నిర్మించాలి. లేనిపక్షంలో బిజెపి తరపున పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం."కంటిముందే కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులు కరిగిపోతున్నా యంత్రాంగం నిద్రమత్తు వీడకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి కమ్మరి కుంట శిఖం భూమిని కాపాడతారో లేదో వేచి చూడాలి.

# 4న శ్యామ్ దర్బార్..!

## - గోడపత్రిక ఆవిష్కరణ

## జాతీయ కళాకారుల రాక

**జహీరాబాద్, ఆగస్టు 31 (ప్రజా జ్యోతి న్యూస్)**

ఝరాసంగం: ఈనెల 4న కృష్ణాష్టమి సందర్భంగా ఝరాసంగం మండలం ఏడాకులపల్లి గ్రామంలో కృష్ణాష్టమి వేడుక లను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఏడాకుల పల్లి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రత్యేక పూజలు, అభిషేకం, భజనలు, కీర్తనలు, ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు శ్యామ్ దర్బార్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను సోమవారం బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ గ్రామస్తులతో కలిసి ఆవిష్క రించారు. శ్యామ్ దర్బార్‌లో పుణెకు చెందిన తబలా కళాకారుడు పాండురంగ పవార్, కొల్హాపూర్‌కు చెందిన హిందుస్థానీ గాయకుడు అర్నవ్ బువా, హైదరాబాద్ కు చెందిన హిందుస్థానీ గాయని ఆరాధనా కర్హాడే, తబలా కళాకారుడు ఉస్తాద్ నిజాముద్దీన్ జావేద్, సితార్ కళాకారుడు నందు కుమార్, బీదర్-తాడ్లాపూర్‌కు చెందిన దత్తు మహారాజ్, నిజామాబాద్‌కు చెందిన తబలా కళాకారుడు శంకర్ సింగ్ సంగీత ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ సమరశంఖం

## - సెప్టెంబర్ 2 నుంచి అందోల్‌లో నిరసనలు..

## - 420 హామీలపై 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన

## - బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పిలుపు

**అందోల్, ఆగస్టు 31, (ప్రజాజ్యోతి):**



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ అందోల్ నియోజకవర్గంలో ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 నుంచి నియోజకవర్గంలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శ్రీ క్రాంతి కిరణ్ తెలిపారు.జోగిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. సెప్టెంబర్ 2న జోగిపేట పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అమలు కాని హామీలను ప్రతిబింబించేలా 420 హామీలతో 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నియోజకవర్గ కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో కొనసాగిస్తామని తెలిపారు.కాంగ్రెస్ పాలనపై ప్రజలకు వాస్తవాలను వివరించడంతో పాటు, ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడి పెంచేందుకు ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని క్రాంతి కిరణ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి.జైపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు పి.నారాయణ ముదిరాజ్, జి.అర్జునయ్య, పైతర సాయికుమార్, మాజీ ఎంపీపీలు రామగౌడ్, జె.బాలయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులు లింగాగౌడ్, చాపల వెంకటేశం, సార శ్రీధర్, ఎ.శంకరయ్య, నాగరత్నం గౌడ్, మాణిక్‌రెడ్డి, బిర్ల శంకర్, ఉసా నాగరాజు, ఖాజా పాషా, విజయ్‌కుమార్, ఖలీల్, ఇమ్రాన్‌ఖాన్, సాయికుమార్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వెయ్యి రోజుల విధ్వంస పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

## - సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు ఏడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు

## - పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ పోరుబాటకు సిద్ధమైంది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు 'కాంగ్రెస్ 1000 రోజుల పాలన 420 మోసాలు' పేరుతో సెప్టెంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు చేపట్టనున్న ఏడు రోజుల నిరసన కార్యక్రమాలపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ దిశానిర్దేశం చేశారు.సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఏడు రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల నిర్వహణపై నాయకుల నుంచి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్ర గౌడ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఏడు రోజుల కార్యక్రమాల కార్యాచరణను నాయకులకు వివరించారు.

**ప్రజల తరపున పోరాడే సమయం ఆసన్నమైంది: చింతా ప్రభాకర్**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల విధ్వంసక పాలనపై ప్రజల తరపున పోరాడే సమయం ఆసన్నమైంది. అరచేతిలో వైకుంఠం చూపించినట్లు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది" అని అన్నారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను కొనసాగించడంతో పాటు అదనంగా మరిన్ని ప్రయోజనాలు అందిస్తామని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఏడు రోజుల కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ' బాకీ కార్డులు ' రూపంలో కాంగ్రెస్ హామీలను ప్రతి గడపగడపకు చేరవేయాలని పిలుపునిచ్చారు." రానున్నది మన ప్రభుత్వమే. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, కేసీఆర్ పాలన రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో ఉన్న లోటుపాట్లు మళ్లీ జరగకుండా చూసుకోవాలి" అని చింతా ప్రభాకర్ అన్నారు. ఆరోగ్యం సహకరించకపోయినా తన గెలుపు కోసం పార్టీ అభ్యర్థులను గెలిపించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు." నేను ఉద్దేశపూర్వకంగా ఎవరికీ పొరపాటు చేయాలని, ఎవరికైనా నష్టం లేదా కష్టం కలిగించాలని భావించే వ్యక్తిని కాదు. క్షేత్రస్థాయి నుంచి రాజకీయాల్లో, జీవితంలో పైకి వచ్చిన వ్యక్తిని. జీవితంలో నేను ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నానో నాకు తెలుసు. అలాంటి అవమానాలు ఎవరికీ జరగకూడదని నేను భావిస్తాను" అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు.

**బాకీ కార్డులను గడపగడపకు చేర్చాలి: చంద్ర గౌడ్**

నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్ర గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ 'బాకీ కార్డులు' ప్రతి గడపగడపకు అందించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు.ఎస్ఐఆర్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు అద్భుతంగా పనిచేశారని అభినందించారు. అదే స్ఫూర్తితో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా, అందరి భాగస్వామ్యంతో వారం రోజుల పాటు కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అన్ని వర్గాల ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందని, ఏడు రోజుల కార్యక్రమాల నిర్వహణలో సంగారెడ్డి జిల్లా ఆదర్శంగా నిలవాలని చంద్ర గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ఏడు రోజుల నిరసన కార్యక్రమాల వివరాలు

**సెప్టెంబర్ 2:**

తెలంగాణ భవన్‌లో లోగో ఆవిష్కరణ, ఏడు రోజుల కార్యక్రమాల ప్రారంభం, సాయంత్రం 6 గంటలకు ప్రెస్‌మీట్. నియోజకవర్గ కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ధర్నాలు, బాకీ కార్డుల పంపిణీ, 420



ఫీట్ల ఫ్లెక్సీ ప్రదర్శన నిర్వహించనున్నారు.

**సెప్టెంబర్ 3:**

వ్యవసాయ రంగ విధ్వంసం, నీటిపారుదల, విద్యుత్, యూరియా, రైతు బీమా తదితర అంశాలపై రైతు సదస్సులు నిర్వహించనున్నారు.

**సెప్టెంబర్ 4:**

వృద్ధులు, వికలాంగులు, మహిళలతో సదస్సులు నిర్వహిస్తారు. మహిళలకు రూ.2,500, కేసీఆర్ కిట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, తులం బంగారం తదితర హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నారు.

**సెప్టెంబర్ 5:**

విద్యార్థులు, యువతకు సంబంధించిన సమస్యలపై కార్యక్రమాలు చేపడతారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ తదితర హామీల అమలును కోరుతూ నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు స్కూటీలు ఇవ్వాలన్న హామీని కూడా ఈ కార్యక్రమాల్లో ప్రస్తావించనున్నారు.

**సెప్టెంబర్ 6:**

పల్లెల విధ్వంసం, పట్టణాలు/గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు, పట్టించుకోని పారిశుద్ధ్య పరిస్థితులకు నిరసనగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**సెప్టెంబర్ 7:**

జిల్లా, మండల ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీల అమలుపై వినతిపత్రాలు సమర్పించనున్నారు.

**సెప్టెంబర్ 8:**

జిల్లా కేంద్రంలో ఏడు రోజుల కార్యక్రమాలపై ప్రెస్‌మీట్ నిర్వహించి, అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించనున్నారు.

**సెప్టెంబర్ 10:**

ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు నిర్వహించే నిరసన కార్యక్రమాలకు బీఆర్ఎస్ పార్టీ తరపున సంఘీభావం ప్రకటించనున్నారు. ఈ సమావేశంలో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, సీనియర్ నాయకులు హకీమ్, డాక్టర్ శ్రీహరి, మాజీ జడ్పీటీసీలు మనోహర్ గౌడ్, కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, చక్రపాణి, విఠల్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బుదేరా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

## - కళాశాల నిర్వహణలో లోపాలు, విద్యార్థినుల పట్ల నిర్లక్ష్య వైఖరిపై చర్యలు

## - జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**



బుదేరా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శైలజను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.మునిపల్లి మండలం బుదేరాలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల నిర్వహణలో లోపాలు, పరిపాలనా వ్యవహారాల్లో నిర్లక్ష్యం, నిర్వహణ సక్రమంగా లేకపోవడం, అలాగే విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ వ్యవహరిస్తున్న తీరుపై పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ప్రత్యేక అధికారి జగదీష్, మండల ప్రత్యేక అధికారి రామాచారి, జిల్లా కోఆర్డినేటర్ కల్పన బుదేరా కళాశాలను సందర్శించి కళాశాల నిర్వహణ, పరిపాలనా అంశాలు, విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు.సమర్పించిన నివేదికలో పేర్కొన్న అంశాలను పరిశీలించిన అనంతరం, ప్రిన్సిపాల్ పి. శైలజ నిర్లక్ష్య ధోరణి, కళాశాల నిర్వహణలో లోపాలు, విద్యార్థినుల పట్ల తగిన విధంగా వ్యవహరించకపోవడం వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్యలు చేపట్టి, ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రెసిడెన్షియల్ కళాశాలల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:**





నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు హెచ్‌డబ్ల్యూఓతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, తాగునీరు, వసతి, భోజనం తదితర అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కల్పిస్తున్న పథకాలు, సదుపాయాలు ప్రతి అర్హుడైన విద్యార్థికి పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.హాస్టళ్లలో విద్యార్థులకు ఇంటి వాతావరణం కల్పిస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని హెచ్‌డబ్ల్యూఓలకు సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈసమావేశంలో నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదల సమస్యలపై సీపీఎం పోరుబాట

## - జీపీ కార్మికుల పునర్నియామకం..

## - ఇందిరమ్మ ఇళ్లు, రైతు సమస్యల పరిష్కారానికి డిమాండ్

**అందోల్, ఆగస్టు 31, (ప్రజాజ్యోతి):**

మండలంలోని పేదలు, కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.తొలగించిన జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోవడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం, ఉచిత విత్తనాలు, ఎరువులు అందించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని, పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసి మౌలిక వసతులు కల్పించాలని, వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, జీపీ కార్మికుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.









# నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:**

తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి టీజేఏసీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్‌యూటీఎఫ్ నారాయణఖేడ్ మండల అధ్యక్షుడు ఏసుదాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నాయక్ పిలుపునిచ్చారు. వారు ఒక ప్రకటనలో పేర్కొంటూ.. నిరసనలో భాగంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను తెలియజేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ సంఘం పీఆర్సీను వెంటనే అమలు చేయాలని, బకాయి పడిన కరువు భత్యం డీఏలను విడుదల చేయాలని కోరారు. అలాగే పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు, పరిష్కార చెల్లింపులను త్వరితగతిన అందించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఉద్యోగికి రూ.2,000 చొప్పున చెల్లించే విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.



## రిటైర్మెంట్ సందర్భంగా డీఈ సత్యానందానికి ఘన సన్మానం

**కల్హేర్, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా కల్హే ర్ మండలానికి చెందిన జెడ్పీటీసీ పదవీ విరమణ సందర్భంగా హైదరాబాద్ మాసాబ్ ట్యాంక్‌లోని ఎస్టీ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయంలో డీఈ సత్యానందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషన్ రెడ్డి డీఈ సత్యానందానికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో కల్హేరు మండలం మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డితో పాటు పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొని డీఈ సత్యానందానికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



## నూతన గృహప్రవేశం లో పాల్గొన్న సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం సీనియర్ నాయకులు బండారి పాండు కురుమ.

**మునిపల్లి ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

మునిపల్లి మండలంలోని మల్లికార్జున పల్లి గ్రామ కురుమ సంఘం నాయకులు మొగులయ్య కురుమ నూతన గృహప్రవేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీ సత్యనారాయణ స్వామి ఆశీస్సులు తీసుకున్న సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం సీనియర్ నాయకులు బండారి పాండు కురుమ ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.





# బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం

- బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలి.
- తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్

**మునిపల్లి, ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

బుదేరాలోని మహిళా డిగ్రీ కళాశాలలో గత నెల రోజులుగా విద్యార్థులకు అందిస్తున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని ఆరోపిస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ వెంటనే కళాశాలకు చేరుకుని విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ, గత నెల రోజులుగా విద్యార్థులకు పురుగులు పట్టిన అన్నం అందిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేయడం అత్యంత దారుణమని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కళాశాల యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యమంత్రి ఇలాంటి పురుగులు ఉన్న అన్నం తింటారా? పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ కళాశాలకు వస్తే వారికి కనీసం నాణ్యమైన భోజనం కూడా అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చింది?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థులకు కళాశాలలో డ్రైనేజీ సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని, అపరిశుభ్ర వాతావరణం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే డ్రైనేజీ సమస్యను



పరిష్కరించి, కళాశాలలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కళాశాల ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు రమేష్ యాదవ్ తెలిపారు. విద్యార్థుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వారి పక్షాన పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మునిపల్లి మండల అధ్యక్షులు నరేష్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగి విరమణ అభినందన సభ

**మునిపల్లి ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లా, మునిపల్లి మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అశోక్ కుమార్ పదవి విరమణ కార్యక్రమలో పాల్గొన్న రావీజ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాంరెడ్డి పటేల్, మండల అధ్యక్షులు సతీష్ కుమార్, సీనియర్ నాయకులు ఖమ్మంపల్లి సంగన్న మరియు ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి కార్యక్రమం

**మునిపల్లి ఆగస్టు 31 (ప్రజాజ్యోతి):**

సోమవారం రోజున ప్రతి సోమవారం జరుగు ప్రజావాణి కార్యక్రమం. యం. పి. డి. ఓ మునిపల్లి ఆధ్వర్యములో మండల పరిషత్ కార్యాలయములో జరిగింది. ఈ కార్యక్రమములో ఎలెక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ వోల్టేజ్ సమస్య పైన ఒక పిటిషన్ వచ్చింది. ఈ కార్యక్రమములో తహశీల్దార్, వ్యవసాయ అధికారి, విద్యాధికారి, మండల పంచాయతీ అధికారి, కార్యాలయ పర్యవేక్షకులు మరియు ఇతర 15 శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



# చేయూత పింఛన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

**రాయికోడ్ ఆగస్టు 31 (ప్రజా జ్యోతి) :**

చేయూత సామాజిక భద్రతా పింఛన్లకు కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హుల కోసం తెలంగాణ ప్రభుత్వం గడువు పొడిగించిందని మండల అధికారులు తెలిపారు. మొదటగా ఆగస్టు 31 వరకు ఉన్న దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 15, 2026 వరకు పొడిగిస్తూ ఎస్ఇఆర్ పి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సోమవారం సర్క్యులర్ జారీ చేశారన్నారు. మండలంలో అర్హత కలిగిన, ఆర్థికంగా మరియు సామాజికంగా వెనుకబడిన వారు పొడిగించిన గడువులోగా చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో షరీఫ్ సూచించారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నాం

## - రాబోయే రోజుల్లో ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం

## - తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 31:**

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామని, రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌కు వచ్చిన సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆవిర్భవించి 120 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఇప్పటివరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోరాటాలను వివరించారు. పార్టీ ఏర్పడిన కొద్ది కాలంలోనే ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై స్పందించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎదురయ్యే చిన్న సమస్య నుంచి పెద్ద సమస్య వరకు తమ దృష్టికి వచ్చిన వెంటనే స్పందిస్తూ, పరిష్కారం కోసం పోరాడుతున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడడంతో పాటు ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పార్టీ నిరంతరం ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు.రైతులు, యువత, మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజలు, మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం ఉద్యమాలు చేపడుతున్నామని అన్నారు. ప్రజా సమస్యలపై రాబోయే రోజుల్లో మరింత బలంగా పోరాడుతామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. నారాయణఖేడ్‌లోనూ తెలంగాణ రక్షణ సేన కార్యకలాపాలు చురుగ్గా కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం మల్శెట్టి బాపు చురుగ్గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నారాయణఖేడ్ ప్రజల ఆదరణతో రాబోయే రోజుల్లో ఇక్కడ తెలంగాణ రక్షణ సేన జెండా ఎగురవేస్తామనే నమ్మకం ఉందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.




## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి - నిర్మల దంపతుల కుమారుడు భరత్ సాయి - పాలక్ పటేల్ నిశ్చితార్థం కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా వట్టి నాగులపల్లిలోని ఇవంతర కన్వెన్షన్ లో సోమవారం రాత్రి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు





జగ్గారెడ్డి – నిర్మల దంపతుల కుమారుడు భరత్ సాయి రెడ్డితో రమేష్ పటేల్ – మాయ పటేల్ దంపతుల కుమార్తె పాలక్ పటేల్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజ నరసింహ, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.